రాజారావు పక్కకి పడిపోయాడు.

కొన్ని క్షణాల క్రితం ఓటమి కలిగించిన విసుగో లేక వికారాన్ని మిగిల్చిన శృంగార రసంలోని పుట్టుకొచ్చిన రౌద్రమో ఇప్పుడు మన్మధరావు రుద్రమూర్తిగా మారి ప్రత్యర్థులపై విరుచుకు పడుతున్నాడు.

ఇప్పుడా ముగ్గురు వ్యక్తులకీ మన్మధరావుని ఎదుర్కొనడం సమస్యగా మారింది.

ఓ చెట్టుచాటుకి చేరిన నానీ అంకుల్‌నీ, అతడ్ని నేల కూల్చాలని రాజారావు ముఠా చేస్తున్న ప్రయత్నాన్ని భయంగా చూస్తున్నాడు.

మూడు నిముషాలపాటు సాగింది ఆ పోరాటం.

క్రమంగా మన్మధరావు అలసిపోతున్నాడు.

ఆ విషయాన్ని ముందుగా గ్రహించిన నానీ....

ఒకవేళ అంకుల్ ఓడిపోతే ఆ తర్వాత జరగబోయే దేమిటో గ్రహించగలిగిన నానీ వెంటనే పరిగెత్తాడు.

కళ్ళలో నీటిపొరలు పేరుకుపోతుంటే తోవ సరిగ్గా కనిపించడంలేదు.

ముళ్ళతో కాళ్ళు గీసుకుపోతున్నాయి.

ఎండుటాకులు అతని పాదాలక్రింద నలిగిపోతూ చిత్రంగా శబ్దం చేస్తున్నాయి.

ప్రాణభీతితో పరుగెత్తుతూనే గమనించాడు తనను ఆ ముగ్గురిలో ఓ వ్యక్తి వెంటాడుతున్న నిజాన్ని.

"అ....మ్మా"

అలాంటప్పుడు ఏ పాటా పాడుకోవాలో చెప్పని అమ్మను గుర్తుచేసుకుంటూ ఆక్రందన చేయబోయాడుగాని అదీ గొంతులోనే సమాధై పోయింది.

అప్పటికే ప్రత్యర్థి చాలా చేరువగా వచ్చేశాడు.

ఈసారి అరవలేదు.

అరిచే సత్తువలేనట్టు స్పృహతప్పిపోతూ నేలపై పడిపోయాడు.

భారంగా రెప్పలు మూస్తున్న నానీకి తెలీదు తను అడవి లాంటి ప్రదేశాన్ని దాటి ఓ తార్రోడ్డుపైకి వచ్చిన విషయం.

ఓ 'జీప్' కీచుమంటూ అగింది అతడి కభిముఖంగా.

నానీని అందుకోబోయిన రాజారావు అనుచరుడు వేగంగా వెనక్కి పరుగెత్తి తక్కిన ఇద్దరు వ్యక్తులతోపాటు చెట్లవెనక నక్కేశాడు.

పోలీస్ యూనిఫాంలో వున్న వ్యక్తి జీప్‌లో నుంచి దూకి తోటలోకి పరుగెత్తబోయాడు కాని "ఆగు" అన్న అరుపుతో ఆగిపోయాడు.

అలా అదేశించింది జీప్ వెనుక కారులో వున్న వ్యక్తి.

ఆయన....

హైద్రాబాద్ నుంచి అంతకుముందే 'గనికొండ' గ్రామాన్ని చేరి అక్కడ అగ్రకులాలవారి దమననీతికి బలైన హరిజన కుటుంబాలను పరామర్శించి మృతుల పేర్న నష్టపరిహారాన్ని చెల్లిస్తామని, న్యాయం జరిపిస్తామని హామి ఇచ్చి సమీప పట్టణంలోని గవర్నమెంట్ గెస్ట్‌హౌస్‌కి తిరిగి వెళుతున్న అగ్రకులానికి చెందిన హోంమినిష్టర్ అప్పారావు.

"పాపం" నానీని చూస్తూ అన్నాడు అప్పారావు "హరిజనుల కక్ష సాధింపుకు గురైన ఓ అగ్రకులానికి చెందిన పసికందు."

ఆ స్టేట్‌మెంట్‌ని విన్న 'ఎస్పీ' నిజమా అన్నట్టుగా చూశాడు. మంత్రిగారి మాటల్ని మననం చేసుకుంటూ.

"ఎంతైనా నా నియోజకవర్గం.... ఆబాలగోపాలం అంతా నాకు పరిచితులే అయినప్పుడు గోపాలం కొడుకుని నేను గుర్తుపట్టలేనా?....ఆ కుటుంబంలో మిగిలింది వీడొక్కడే..... జీప్‌లో చేర్చండి" అన్నాడు సాలోచనగా.

మరో అరగంటలో టౌన్‌లో ఏర్పాటు చేయబడిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వీడ్ని అడ్డం పెట్టుకునే నా కులాన్ని రక్షించుకోవాలి అనుకుంటూ కారెక్కాడు.

"మొన్న గనికొండ గ్రామంలో జరిగిన మారణహోమంలో కొందరు హరిజనులు ప్రాణాలు కోల్పోయిన మాట వాస్తవమే. మరికొంతమంది గాయపడి గ్రామాన్ని వదిలిపెట్టి పారిపోయినమాట నిజమే అని ఒప్పుకుంటూ అసలు అగ్రకులాలవారు మాత్రం సుఖంగా వున్నారా అని నేను మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను. లేదూ అన్న సత్యాన్ని సోదహరణంగా మీకు చూపాలనే ప్రయత్నంలో నా కళ్ళముందే ప్రాణాలు కోల్పోయే స్థితిలో నా చేత రక్షింపబడిన గోపాలం కొడుకును ఇప్పుడు మీ ముందుకు రప్పిస్తున్నాను. అయితే ఒక్క షరతు.... పసివాడు తన కుటుంబమంతా ఎంత రాక్షసంగా కడతేరిపోయిందో కళ్ళారా చూసివుండటంతో కాస్త మన స్థిమితాన్ని తప్పివున్నాడు కాబట్టి కంగారు పెట్టొద్దని మనవి చేస్తున్నాను."

వెంటనే పియ్యేని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు.

"ఆ కుర్రాడింకా లేవలేదండి" పియ్యే గొంతు గుసగుస లాడింది.

"అందుకే తీసుకురమ్మంటున్నది" కస్సుమంటూ చెవిలో వూదాడు- ఇలాంటి పియ్యేని భరించేకన్నా ఏనుయ్యో గొయ్యో చూసుకోవడం మిన్న అన్నట్టుగా.

సుమారు మధ్యాహ్నం రెండు గంటలకి గెస్ట్‌హౌస్‌లోని ఓ హాల్లో మొదలైన ప్రెస్ కాన్ఫరెన్స్‌కి అటెండైన అన్ని దినపత్రికల విలేఖర్లూ 'గోపాలం కొడుకు' ఫోటోతీసి పత్రికల్లో వేయడానికి ప్రిపేరవుతున్నారు.

అదిగో అప్పుడు తీసుకొచ్చాడు పియ్యే నానీని..... ఎత్తుకుని కాదు.... నడిపించుకుని.

తొట్రుపడ్డాడు హోమ్ మినిష్టర్ అప్పారావు.

ఇంకా స్పృహతప్పే వుంటాడన్న నమ్మకంతో అర్జెంటుగా ఓ నాటకాన్ని

ఆడేద్దామనుకుంటే నాని మామూలుగా నడిచి రావడంతో నానీకన్నా తన రాజకీయాన్ని అర్థం చేసుకోలేని పియ్యేని మహావుక్రోషంగా చూశాడు.

ఇదేది గమనించని పియ్యే నానీని అప్పారావు పక్క సీట్లో కూర్చోపెట్టగానే ఫ్లాష్ లైట్సు వెలిగాయి వరుసగా.

నానీ విస్తుపోయి చూస్తున్నాడు అదంతా ఏంటో అర్థంకాక....

"కుర్రాడు కంగారు పడుతున్నాడు ఇక లోపలికి తీసుకువెళ్ళు" అన్నాడు అప్పారావు గొంతు తడారిపోతుంటే.

"ఒక క్షణం సర్" ఓ విలేఖరి అన్నాడు "అబ్బాయిని కొన్ని ప్రశ్నలడుగుతాం."

"హమ్మమ్మో..... వాడసలే షాక్‌లో వున్నాడు" చెప్పాడు.

గట్టిగా అభ్యంతరం చెప్పాడు కాని అప్పటికే నానీ చెబుతానన్నట్టు తలూపేసరికి అప్పారావు గాభరాపడ్డాడు.

"మీ అమ్మా నాన్నల పేర్లు?" మరో విలేఖరి నానీని చూస్తూ అడిగాడు.

"అమ్మ పేరేమో పావని అన్నమాట... నాన్న...."

"గోపాలం" అప్పారావు టక్కున జవాబిచ్చాడు.

"కాదు... చంద్రం" నిజాన్ని నిబ్బరంగా చెప్పాడు నానీ.

"అదేంటి....?" విలేఖర్లు విస్తుపోతుంటే తొట్రుపడిన అప్పారావు "అదేంటంటే... చంద్ర గోపాలం.... బయటంతా గోపాలం అంటే, ఇంట్లో వాళ్ళంతా చంద్రం అంటారు. మరేం.... అసలు వీళ్ళమ్మగారున్నారే..." మాట మార్చబోతుంటే నానీ జోక్యం చేసుకున్నాడు.